


# చీకటి వెలిగింది

అవసరాల రామకృష్ణారావు

అసలు లోకంలో గొప్పవాళ్ళు అయిన వాళ్ళం దరూ బీదవాళ్ళ బాధల గురించి రీసెర్చిచేసి బాగుపడ్డ వాళ్ళేనట. అలాంటి ప్రచారం ఎల్ల కాలం సాగాలంటే బీదలూ వారి బాధలూ యథా తథంగా ఉండడం తప్పని సరి కదా! ఇంతకీ ప్రచారం చెయ్యాలంటే స్వరం పెద్దదిగా ఉండాలి. కడుపు నిండకపోతే కంఠం పెగ లదు కదా ఖర్మ! అందుకని ప్రతిమనిషి తనదైన ఆస్తి బాగా సంపాదించక తప్పదు.

ఇలా సాగుతున్న రంగరాజు ఆలోచనా ధోరణి భార్య శ్యామలాంబ కేకతో ఒక్క సారి తెగిపోయింది.

"అవతల అంత పెద్ద ప్రయాణం పెట్టు కుని నిమ్మకి నీరెత్తినట్టు ఎలా కూర్చోగలిగే రని! మంగళారం రాత్రి లగ్నం, మరచి పోయారు కాబోలు. ఆఖరి క్షణంలో కచ్చల్లో కందులు వేయించేస్తే నావల్లగాదు, ముందే చెబుతున్నాను!"

చేతిలో సోషలిజం అనే పుస్తకం వున్నా దాని వైపు చూడక తన ఆలోచనలో తను మునిగి తేలుతున్నాడు. భార్య కేకతో ఆ పుస్త కాన్ని మంచంమీదకి విసిరేసి లేచి నిలుచున్నాడు రంగరాజు.

"ఇంత • అవ్యవధిగా అర్జంటు టెలి గ్రాము కొడితే ఎలా బయల్దేరతామను కొన్నారు మీ అన్నయ్య? మనం ఉన్నదేం తమలాంటి బొంబాయి మహానగరం అని ఉద్దేశమా? ఓ రైలుస్టేషన్ అయినా అఘోరిం చలేదే యీ మాయదారి ఊరికి? అయినా తనకి జ్ఞానం లేకపోతే అన్నీ చూస్తున్నావ్ తగుదు నమ్మా అని నువ్వెలా తయారయావంట? బస్సుమీద రైల్‌స్టేషన్ ఉన్న వూరికి తగలడి, అక్కడ అర్ధరాత్రి ప్యాసింజరు అందుకుని రాయఘూర్‌లో హౌరా బోంబేమెయిలు పట్టు కోవాలి. ఇంత ప్రయాణం అంటే ముందెన్ని చూసుకోవాలి....ఎప్పుడిచ్చి చచ్చాడో నిన్న శనివారం మధ్యాహ్నానికి గాని అందలేదే ముదనష్టపు తంతి! ఓ బ్యాంకి అయినా తెరిచి తగలడరు. ఇవాళ రెండో గంటకి బస్సులో పడితేగాని అందుకోలేం. మళ్ళీ చెప్పలేదను కునేవు. మనం పెళ్ళికి వెళ్ళడం అనేది కలలో వార్త!"

అని హడావిడిగా వీధిలోకి వెళ్ళిపోయాడు రంగరాజు. శ్యామలాంబ ఏమాత్రం చిన్న బుచ్చుకోలేదు సరిగదా చిన్న కూనిరాగం తీస్తూ బట్టలు సర్దుకోసాగింది. ఆమె అంచనా తప్పు అవలేదు. మరో రెండుగంటలు దాట కుండా సుడిగాలిలా దూసుకొచ్చి—

"ఇంకా అలాగే కూర్చున్నావేం? ఇంకో గంటలో ప్రయాణం పెట్టుకుని. ఇన్నేళ్ళొచ్చేయి ఎందుకూ ఆ మాత్రం ఇంగితం తెలియకపోయాక? నీ కేమో ఒక్కగా నొక్క అన్నయ్యా, ఆయనకేమో ఒక్కగానొక్క కూతురూ....పెళ్ళని వెలిగించబోతున్నాడు పెళ్ళి. ఇదంతా నాకేదో ఉపకారంలా ఉంది చూడబోతే. మీరూ మీరూ ఒకటి. అక్కడికి నేనే పైవాణ్ణి, మధ్యని నా మొహంమీద



జిల్లుతారు పేడనీళ్ళు నేను గనక బయల్దేరక పోతే.... లేనిపోని రొప్పు పడ్డానికి నేనేం అంత అమాయకపు వెధవ ననుకున్నారా మీరంతా? అయ్యో,చెబుతున్నది వింటూ తీరిగ్గా ఎంత విల బడిపోయిందో! ఆ హోల్డాలు బెల్టు ఒక్కటే కనపడుతోంది. రెండోది ఎక్కడ అఘో రించిందో వెతకవేమే దరిద్రపు మొహమా!"

బస్సు ప్రయాణం పొడువునా కూడా ఇవి తప్పలేదు శ్యామలాంబకి. ఈ బాజాభజంత్రీలు ఆయన తన మెడలో మూడుముళ్లూ వేసిన నాటినుంచీ ఆరంభమయాయి. తనకో ఆయ నకో ఏడు కట్లూ వేసేదాకా ఇవి అవిచ్ఛి న్నంగా సాగుతూనే ఉంటాయి. కొత్తగా వినేవాళ్ళకి కొంత ఆశ్చర్యంగా తోచవచ్చు నేమోగాని తను ఏనాడో వాటికి ఇమ్యూన్ అయిపోయింది. తిట్లు మీదపడి కొట్టక గదా! పని సాధారణంగా సవ్యంగానే జరిగిపోతూం టుంది. అంటే అన్నీ తనకి అనుకూలంగానే జరుగుతాయనిలేదు. తనకి తోచినట్టే చేస్తాడు ఆయన. అందులో అనుమానం ఏమీలేదు. అయితే ప్రపంచనైజం అధ్యయనం చేసిన మనిషి. ఆయన్ని అనుసరించడంలో నష్టం లేదని ఆమె అనుభవమే ఆమెకి గుర్తు చేస్తోంది.

"చూడూ ముహూర్తం ఎప్పుడనావూ?" అన్నాడు బస్సు దిగి సామాన్లు కింద పెట్టించాక.

"శెల్రిగ్రాము మీరే చదివి వినిపించేరుగా నన్నడుగుతారేం. ఎల్లుండి అర్ధరాత్రి కదూ?"

"ఏమోవే ఇప్పుడే అనుకున్నాను, నీ ఒంటిమీద నగలు చూసి."

శ్యామలాంబ కుచ్చెళ్ళు కొంచెం వదులు చేసుకుని బాగా ఇంత పమిట తీసుకుని నగ లన్నీ మరుగుపడేలా కప్పుకుంటూ అంది.

"అవ్వ! అన్నీ తనే అంటే నేనేం జేతు నమ్మా! లాకర్లో పెట్టి రావడానికి బ్యాంకి శలవయిపోయె....ఇంత బంగారం ఎంత నమ్మకస్థులయినా యింకోళ్ళ యింట్లో పెట్టి రాడానికి చేతులు రాకపోయె...."

"అలాగలాగే....చిరు చీకటివేళ. ఇక్కడ చేరుకున్నామా, అర్ధరాత్రిదాకా ఆ ప్యాసెం జరు దిగబడదు. ఒంటెడు నగలతో అంత వరకూ ఎక్కడ గడుపుతావో అది నువ్వు ఆలోచించుకోవలసిందే. అయిదుపేటల చంద్ర హారం. రెండుపేటల జిగినీనాను. ముత్యాల గొలుసు, రాళ్ళ నెక్లెసు, వజ్రాల దుద్దులు, పదేసి జతల గాజులు...."

"అబ్బ, ఏమిటా అరుపులూ?" అటూ ఇటూ భయంగా చూసింది శ్యామలాంబ. సహస్రనామాలు చదివే మొగుడితో కాపురం చేస్తున్నందుకు తెలుగు తెలియని ఊళ్ళో ఉండడం ఓ అదృష్టమే. మెడలో ఒంటిపేట గొలుసూ చేతికి ఒక్క జత గాజుల్తో కన్యా ధార పోశారు తనవాళ్ళు. ఈ ఇరవై ఏళ్ళలో ఒక్కొక్కటీ తన చేత్తో తనే చేయించాడు ఆయన. ఎందుకూ, యిల్లు దాటితే చాలు యిలా దెప్పి పొయ్యవచ్చు అనా?

"ఎంత చిన్న స్టేషనయినా ఏదో రకం వెయిటింగ్‌రూం అనేది ఉండకపోదు. పదండి అక్కడికి పోదాం."

"ఇలాంటి స్టేషన్లకి వెయిటింగ్ రూం ఒకటా! ఓవేళ వున్నా అందులో ఏడిసే సేఫ్టి అనగా ఎంత? నేనాలోచించేది అదికాదు...."

"....మరి?"

"తోక అనేది లేకపోయింది యీ ఆడా ళ్ళకి. ఉంటే దాన్ని కూడా ఆ చివర్నుంచి యీ చివరిదాకా నగల్తో నింపి ఉందురు?"

రంగరాజు హాస్యానికి నవ్వు రాలేదు సరిగదా భగ్గున ఒళ్ళు మండింది శ్యామలాం బకు. విసుక్కుంటూ అంది:

"నన్నెందుకు చంపుతారుగాని, ఎంతసే పిలా బస్‌స్టాండ్‌లో నిలబెడతారు. ఎక్కడికో అక్కడికి దారి తియ్యండి, పోదాం."

ఆమె ఊహించినట్టే ముందు జాగ్రత్త లేకుండా యేం బయల్దేరలేదతను. అన్ని సదుపాయాలూ వున్న గవర్నమెంటు గెస్ట్ హౌస్ ఒకటి అక్కడుందనీ, ఆ రోజు అక్కడ ఏ మినిస్టరూ కేంప్ చెయ్యడం లేదనీ ముందుగా కనుక్కున్నాడు. దానికి సంబంధించిన ఆఫీసరు తన ఫ్రెండే. తన ఊరినుంచే అక్కడికి ఫోన్ చేయించాడు. "ఈ మాత్రందానికి నన్నింతలా రిక్వెస్ట్ చెయ్యాలా రాజూ! ఓసారి ఆ గది కడిగేసి నీళ్ళూ అవీ పెట్టి ఉంచమని వాచ్‌మెన్‌కి ఫోన్ చేయిస్తాను. వాచ్‌మెన్ మదన్‌మిత్రాకి బాగా హిందీ వచ్చు. మంచివాడు. మీరూ మీ శ్రీమతీ అక్కడ విశ్రమించవచ్చు. పాసెం జరు ఎంతకీ, రెండుకి కదూ? వాడే లేపి మిమ్మల్ని స్టేషన్‌కి దిగబెడతాడు. డోన్ట్‌వర్రీ! గవర్నమెంటు ఉద్యోగి. మిమ్మల్నేవడడ్డు తాడు?"

ఆఫీసరు చెప్పినవన్నీ అక్షరాలా నిజమే నని ఆ గెస్ట్‌హౌస్‌కి చేరీ చేరగానే తెలిసి పోయింది రంగరాజుకి. అడవిలాంటి ఆ పల్లెటూళ్ళో హైక్లాస్ హోటల్ డబుల్ రూంలా వుంది అది. ఆ ఆవరణలోనే దూరంగా ఓ మూలకి పాక వేసుకుని కాపుర ముంటున్నాడు మదన్‌మిత్రా.

ఇక్కడ మంచినీళ్లైనా పుట్టవని ముందే తెలుసుగనక ఉప్మా చేసి తెచ్చింది శ్యామ లాంబ. అది తిని నాలుగేసి అరటిపళ్ళు తిన్నాక, ఇక ఏ మాత్రం బితుకువున్నా ఎగిరి

పోయినట్టైంది.

శ్యామలాంబ బాత్‌రూంలో కేరియరు గిన్నెలు తోముతోంది. రూం వరండాలో వున్న బల్లమీద రంగరాజు కూర్చుని, మెట్ల మీద కూచున్న మిత్రాతో ఇందిలో బాతాఖానీకి తగులుకున్నాడు. ఇంకొళ్ళ గురించి అడగడంగాని తెలుసుకోడంగాని రంగరాజుకి ఆట్టే అలవాటు లేదు. కానీ తండ్రి ఎంత వారిస్తున్నా దగ్గరకొచ్చి ఈగల్లా ముసురుతున్న అతని సంతానంపైన తేరిపార చూడక తప్పలేదు. దుర్భర దారిద్ర్యం అనుభవిస్తున్నట్టు స్పష్టంగా తెలుస్తుంది వాళ్ళని చూస్తే ఎవరికైనా. అందులో ఆ రోజు పొద్దున్నే కొంతవరకు చదివిన సోషలిజం పుస్తకంలోని ఆలోచనలు అతన్నింకా వెంటాడడం మానలేదు. ఈ నలుగురి పిల్లలూ కాక యింకా చంటివాడొకడు తల్లిదగ్గర ఉన్నాడుట. ఆ ఇల్లాలు కడుపుతో ఉన్నదానట. వీళ్ల చాలక ముసలి తండ్రీ, పెళ్ళికాని చెల్లెలూనట. ఇందరూ కలిపి ఆ ఒంటివాసముకలో ఉంటున్నారు ఇంత గుడ్డి దీపం పెట్టుకుని. పైన సీలింగ్‌ఫేన్‌తో, కింద రెండు ఫోమ్‌బెడ్ మంచాలతో ఎటాచ్‌డు లెట్రిన్ కమ్ బాత్ రూమ్‌లో బార్‌లైట్స్‌లో వెలిగిపోయే మార్బుల్ ఫ్లోరింగ్‌తో, రైల్వే వెయిటింగ్ రూమ్ అంత గది ఇది.


"మేం మీకు సమస్త సదుపాయాలూ ఇస్తున్నాం. రక్షణ కల్పిస్తున్నాం. అయినా మీకు మానవత్వం లేదు. కృతజ్ఞత లేదు. అయితే ఒక్కటి మాత్రం గుర్తుంచుకోండి. ఇలా ఎల్లకాలం జరగదు."

అని హెచ్చరిస్తున్నట్టుంది సడిశె, మిత్రా కుటుంబం ద్వారా.

"ఏడిశావ్.... మేమే మిమ్మల్ని పోషిస్తున్నాం. అలా పోషించాం కాబట్టే ఈ మాత్రంగా ఉన్నారు. అయినా ఎవరి కర్మకెవరు కర్తలు! నోరు మూసుకు పడుండండి."

అని జవాబు చెప్పించినట్టయింది తన ద్వారా గెస్ట్‌హౌస్.

"ఛ....ఛ....ఒకరికి జవాబు చెప్పే కర్మ నాకేమిటి? మత సూత్రంగానో రాజకీయ సూత్రంగాని కేవలం ప్రచారంకోసం పుట్టినవి. వాటిని అడ్డుపెట్టుకుని చేతనైతే నాలుగు



రాళ్ళు చేసుకోవాలిగాని వాటిమీద తర్జన భర్జన ఒకటా!"

అనుకుని లేచి నిలబడిపోయాడు రంగరాజు.

"నువ్వు పిల్లల్ని తీసుకుపోరా.... నేను పడుకుంటాను. ఒంటిగంటకి నీకు తెలుస్తుంది గదూ?"

అని ఇంకా అడుగుతూనే వున్నాడు. ఒక్కమారుగా కరెంట్ పోయి అంతా కటిక చీకటి అయిపోయింది. అప్పుడుగాని తెలిసిరాలేదు రంగరాజుకి తన చుట్టుపక్కల ఎంత పెద్ద పెద్ద చెట్లున్నదీ.... అవి తెలియజెయ్యడానికన్నట్టు అప్పుడప్పుడు మెరుపులు, అన్నిట్నీ మించి, వెక్కిరిస్తున్నట్టు గుడిసెలో దీపం.

"ఇక్కడ యిలా దీపాలు పోవడం అలవాటే. ఒక్కొక్కప్పుడు గంటల తరబడి రాకపోవడం ఉంది. అయినా యెప్పుడోగాని అలా జరగదు. ఏం భయపడకండి బాబూ.... నే ఉన్నాగా.... ఎప్పుడు పిల్చినా పలుకుతాను. కావలిస్తే మా బుడ్డిదీపం తెచ్చిపెడతాను."


రంగరాజు ఏం జవాబు చెప్పనోగాని లైట్లు వెంటనే వెలిగేయి. ఏమిటో ఇక అక్కడ కూచో బుద్ధిపుట్టలేదతనికి. లోపలికి వచ్చి అడ్డగడియ వేసేశాడు. ఆ గడియను చూసి అతను గతుక్కుమన్నాడు. చాలా వచ్చుకం కర్రతో ఏదో ఒకటి పేరుకి తగిలించి నట్టుందది. మనిషి అంతా బాగుండి మూతి వంకరగా ఉన్నట్టుందది. అంత ముఖ్యమైన చోట అంత అశ్రద్ధ చూపినందుకు ఎంతో తిట్టుకున్నాడు అతను. బిల్డింగ్ సేఫ్టీ మీద అతని నమ్మకమంతా ఆ క్షణంలో ఎగిరిపోయినట్టయింది. ఈ అల్లరి చాలక లైట్లు పోవడం, రావడం ఇదొకటి. పైగా అప్పుడప్పుడు చినుకులు. ఈదురుగాలి.

'దీనికేం పట్టినట్టులేదు. హాయిగా నిద్రపోతోంది. అసలు ఇలాంటప్పుడు నిద్రెలా పడుతుందో.... నా యీ ఆందోళనకి మూల కారణం ఇదీ దీని నగలూ కావూ?' అనుకుంటూనే రంగరాజు నిద్రలో పడ్డాడు.

కిటికీలోంచి వర్షపు చుక్క మొహంమీద పడి త్రుళ్ళిపడి లేచాడు రంగరాజు. లేస్తూనే వాచీ చూసుకున్నాడు. రేడియం ముళ్ళు 'రెండుకాదు, మేం ఒకటే' అని చెబుతున్నాయి. వర్షం ఎక్కువైపోయినట్టుంది. జల్లు లోపలికి వచ్చేస్తోంది. చిడత ఊడిపోయిన ఆ కిటికీ రెక్కని ఎలాగో అలా వేసేద్దామని ఎంత ప్రయత్నించినా కుదర్లేదు. భయంకరమైన గాలి చప్పుడు. హోరుమని వర్షం. కళ్ళు మిరిమిట్లు గొలిపే మెరుపులు. అంత చల్లటి వాతావరణంలోనూ చెమటతో తడిసి ముద్దయ్యాడు.

స్విచ్ నొక్కేడు. లైటు వెలగలేదు. కిటికీ రెక్కలోంచి కనిపిస్తూనే వుంది. పై వరండాలో లైటులేదు. వీధిచివర లైటు ఉండాలి. అదీలేదు. అంతటా గాఢాంధకారం. అతన్ని అన్నిటికన్న భయపెట్టింది అవతల నుంచి గాలి బలంగా తొయ్యగా విడిపోదామని విశ్వప్రయత్నం చేస్తున్న వీధితలుపు, ఆ ప్రయత్నంలో వినిపిస్తున్న చప్పుడు.

అర్థరాత్రివేళ. మారుమూల గ్రామం. మన ఊరుకాదు. మన భాషకాదు. పాతికవేలు చేసే




బంగారం. ఎవడికి చేదు? తాము చూ స్తే ఇద్దరే. గంపెడు బలగం వాళ్ళది. బంగార  దొరికేక మనుషుల్ని మిగలనిస్తారా? అవురావ  నే ఆకలి వాళ్ళది. అవకాశం దొరికితే ఆగుతా ? నిశ్చిం తగా నిద్రపోతున్న పెళ్ళాన్ని చూ  భగ్గున ఒళ్ళుమండిపోయింది రంగరాజుకి. కొట్టినంత పనిచేసి లేపి కూచోబెట్టేడు.

అంతే. ధనాధన్ పడిపో యా యి పిడుగులు.

"ఏమే! ఒంటినిండా నగలు  ంగారించు కుని ఎక్కడికి నువ్వు బయల్దేరింది పెళ్ళికా? ఎవరి పెళ్ళికి? నీ మేనగోడలు పె ళ్ళికా. నీ మొగుడి పెద్ద కర్మకా? దేశం ఎ గా ఉంది. దేశంలో పరిస్థితులెలా ఉన్నాయి. మన ఖర్చు లెలా ఉండాలి. ఏ కొంచెమైనా ఆలోచన ఉందీ నీకు?

దున్నపోతులా తిని కూచుని, కూచుని తిన్నది అరక్క. పెళ్ళంటూ త  క్కవైందా నీ మొహానికి? ఎంతదూరమైనా  రవాలేదని బయల్దేరిపోతావా? ఇందాక ఆ  ర్భాగ్యుడు వచ్చాడు. ఎవడు. నైట్‌వాచర్  డు. వాడి మొహం వాడి పిల్లల మొహం  క్కమారు గుర్తు తెచ్చుకుంటే అన్నంముద్ద  ోపలి కెళ తుందా నీకు?

తలకి నూనెచుక్కలేదు. తాగ  నికి గంజి చుక్కలేదు.

అంతేకాదు. ఏడుద్దామన్నా క  ళ్లో కన్నీటి చుక్క లేదే వాళ్ళకి.

ఓ పట్టుచీర కట్టుకుంటే కొన్ని వేల పట్టు పురుగుల్ని హత్యచేసినట్టు లె క్కట. ఓ బంగారు నగ పెట్టుకుంటే ఎంద  అలాంటి అమాయకుల్ని పొట్టకొట్టినట్టు గు ర్తే!

ప్రేతాల మధ్యనుంచి పెళ్ళివేడుకకి బయ ల్దేరావా?

భూతాల మధ్యనుంచి బూరిముక్క అందు కుందామనే:

నీ ఆట ఇన్నాళ్ళకి కట్టింది.

నీ కోం ఇన్నాళ్ళకి చిక్కింది వాళ్ళకి.

అదిగో. ఇక వీధితలుపు ఆగేలాలేదు.

విను. వినపడ్డంలేదా రొద? వచ్చి పడి పోతోంది వరద.

నిన్నూ నన్నూ ముంచేస్తుంది. వచ్చేస్తు న్నారు. వచ్చి పడిపోతున్నారు. నీ వంటిమీద నగలు ముక్క ముక్కా పంచుకుంటారు.

నిన్నూ నీతోపాటు నన్నూ ముక్క ముక్కా సంజుకుంటారు.

....................

శ్యామలాంబ ధైర్యం పూర్తిగా చెదిరి పోయినట్టుంది. లేచి లైటువేద్దామంటే రెండు చేతులూ నొక్కిపెట్టి పట్టుకున్నాడు. ఆ ధోరణి కంతూపంతూ కనపళ్లేదు. భయం దుఃఖంగా మారి పెద్ద గొంతుకతో ఏడుపు మొదలెట్టింది. దాన్తో పైనున్న వాచ్‌మెన్ లేచాడు. ఎందుకో అమ్మగారు ఏడుస్తోందని వాడు గ్రహించి ఉండాలి. లైట్లు పోయాయి. వాళ్ళ ఓ టార్చి లైటైనా తెచ్చుకున్నట్టు లేదు. అయ్యో సిగ రెట్టయినా కాల్చినట్టు లేదు, అగ్గిపెట్టె ఉండదు కదా! చీకటికి భయపడి అమ్మగారు ఏడుస్తోం దేమో! 'మా గుడిసెకి పరిగెత్తి దీపం తెచ్చి స్తాను. భయపడకండి. తలుపు తెరవండి' అని బాదేడు.

'వద్దురా బాబూ! మీరు అక్కడే ఉండండి. మేం ఇక్కడే ఉంటాం. ఆమాత్రం తలుపైనా అడ్డం వుండనీ. దీపం మిషతో తలుపు తీయించి మా అంతు చూద్దామనేగా మీ ప్రయత్నం?'

రంగరాజు అరుస్తూనే వున్నాడు. పెద్ద గాలిపెట్టుకే తలుపు అడ్డగడియ ఎగిరిపోయి తలుపులు బార్లా తెరుచుకుపోయాయి. అంతే. గది కిక్కిరిసిపోయింది. ఒకటా రెండా కొన్ని వేల నీడలు అలా గదిలో ప్రవేశించడం అతనికి కనబడుతూనే వుంది. శక్తి అంతా కూడగట్టుకుని ఒక్క అరుపు అరిచేడు.

ఆ కేకకి ఇటు శ్యామలాంబా అటు వరం డాలో పడుకున్న మదన్‌మిత్రా త్రుళ్ళిపడి లేచారు. ఆమె వెంటనే లైటువేసింది. మొగుడి రెండుచేతులూ పట్టుకు కుదిపివేసి కూచోబెట్టిం ది. అతనికి కాస్త తెలివొచ్చాక అడిగింది.

'ఏమండీ! ఏమిటంత కేకవేశారు? ఏదైనా పీడకలగాని వచ్చిందా?'

మొహంమీద నీళ్ళు జల్లింది. అంత రాత్రి వేళ స్టేషన్‌కి పరిగెత్తించి మిత్రాచేత టీనీళ్లు తెప్పించి నోట్లో పోసింది. అప్పటికిగాని రంగరాజు వణుకు తగ్గలేదు. అప్పటికిగాని జరిగింది కల అని అతను నమ్మలేదు.

ఇంకొంతసేపటికి వాళ్ళిద్దరూ పాసెంజర్లో ఫస్టు క్లాస్ కంపార్ట్‌మెంట్‌లో వున్నారు. కింద ప్లాట్‌ఫారంమీద మదన్‌మిత్రా పెద్ద కొడుకూ ఉన్నాడు. శ్యామలాంబ అంది. 'ఏమండీ ఇంతగా మీరు భయపడతారని తెలిస్తే నగల్తో ఇలా బయలుదేరి వుండను. ఇంతకీ వాచ్‌మెన్ చేసిన సాయం ఇంతా అంతానా? ఇంత రాత్రివేళ ఇలాంటి ఊళ్ళో ఓ మొత్తు మొత్తితే ఎవరు దిక్కు? అంత చినుకుల్లో వరండాలో పడుకుని కంటికి రెప్పలా కాశాడు. ఇంత చలిలో తీసుకొచ్చి జాగ్రత్తగా రైలెక్కించాడు. పాపం పిల్లల వాడు. వాడికో పది రూపాయలైనా పడే య్యండి.' సలహా ఇచ్చిందిగాని మొగుడేం చేశాడో చూడలేదామె. 'ఎక్కడివాళ్ళని అక్కడే వుంచడం మంచిది' అని గొణు క్కుంటూ ఓ అర్ధరూపాయి కాసు విసరడం ఆమె గమనించలేదు.

'ఛ....ఇంతాచేసి ఇదా ఇచ్చేది? పుచ్చు కోకు' అన్నట్టు అసహ్యంగా చూశాడు కొడుకు. 'పదేసి రోజులపాటు బసచేసి పైసా చేతిలో పెట్టరు మహరాజులు. ఎక్కడికక్కడే సంతోషించాలి మరి' అన్నట్టు ఆప్యాయంగా అందుకొని నమస్కరించాడు మిత్రా.

రైలు కదిలింది. చీకట్లోకి ప్రయాణించడం దానికి మామూలే. ★